
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
సోమవారం । 27 । నవంబర్ । 2023



రక్తమోడిన రహదారి

తుని మండలం చేపూరు వద్ద జాతీయ రహదారిపై లారీ ఢీకొన్న ప్రమాదంలో కొడుకు సంఘటన స్థలంలో, ఆసుపత్రికి తరలిస్తూండగా తల్లి మృతి చెందారు.

- 8లో▸



డెల్టాలకు 6 వేల క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం తూర్పు డెల్టాకు 600, మధ్య డెల్టాకు 1,400, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

వెండి మకరతోరణం సమర్పణ



మామిడికుదురు: స్థానిక పార్వతీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారికి నయినాల రాజారావు కుమారుడు శ్రీనివాసరావు దంపతులు ఆదివారం రూ.1.80 లక్షల విలువైన 2 కిలోల వెండి మకర తోరణం సమర్పించారు.

న్యూస్‌రీల్

దేదీప్యంగా జ్వాలా తోరణం

కిక్కిరిసిన మురమళ్ల



మురమళ్లలో జ్వాలాతోరణ వేడుకను తిలకిస్తున్న భక్తజనం

ఐ.పోలవరం: నిత్య కల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. కార్తిక పౌర్ణమి సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజామునే పవిత్ర వృద్ధ గౌతమీ గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం ఆలయ ఆవరణలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. పౌర్ణమి తిథిని పురస్కరించుకుని భద్రకాళీ అమ్మవారు రజిత చీరలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం జ్వాలా తోరణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ వేడుకలను అశేష భక్తజనం మధ్య కోలాహలంగా నిర్వహించారు.

నేడు యథావిధిగా 'స్పందన'

అమలాపురం రూరల్: సమస్యల పరిష్కార వేదిక స్పందన (జగనన్నకు చెబుదాం)ను సోమవారం యథావిధిగా నిర్వహిస్తామని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అమలాపురం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి, ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్ స్థాయి, తహసీల్దార్ల కార్యాలయాల్లో గ్రామ, వార్డు సచివాలయాల్లో అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారని వివరించారు. అధికారులంతా ఉదయం 10 గంటల నుంచే అందుబాటులో ఉంటారని, గ్రామ స్థాయిలో వార్డు సచివాలయాల్లో మాత్రం మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల మధ్య విజ్ఞాపనల స్వీకరణ ఉంటుందని కలెక్టర్ తెలిపారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నూకాంబిక ఆలయ ఈఓగా కృష్ణ



ఆలమూరు: చింతలూరులోని నూకాంబిక అమ్మవారి ఆలయ కార్యనిర్వాహణాధికారి (ఈఓ)గా ఎంఎస్ఆర్ కృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా దేవదాయ శాఖ నుంచి ఉత్తర్వులు అందినట్టు ఆలయ కమిటీ ఆదివారం తెలిపింది. మండలంలోని పెనికేరు గ్రూపు దేవాలయాలకు ఈఓగా పనిచేస్తున్న కృష్ణ ప్రస్తుతం శ్రీనూకాంబిక అమ్మవారి ఆలయం ఈఓ (ఎఫ్ఏసీ) బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ ఈఓగా పనిచేసిన ఉండవల్లి వీర్రాజు పిఠాపురంలోని పాదగయ కుక్కుటేశ్వరస్వామి ఆలయానికి బదిలీ అయ్యారు.

3న యూటీఎఫ్ కొత్త కౌన్సిల్ సమావేశం

అమలాపురం టౌన్: జిల్లా యూటీఎఫ్ కొత్త కౌన్సిల్ సమావేశం వచ్చే నెల 3న రావులపాలెంలోని ఎమ్‌కేఆర్ కన్వెన్షన్ హాలులో నిర్వహిస్తామని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జ్యోతిబసు తెలిపారు. ఆదివారం స్థానిక యూటీఎఫ్ హోమ్‌లో జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జ్యోతిబసు 3న జరిగే జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహణపై చర్చించారు. ఆ రోజు కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని జిల్లాలోని యూటీఎఫ్ ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. అనంతరం ఇటీవల మృతి చెందిన ఉమ్మడి జిల్లా యూటీఎఫ్ అధ్యక్షుడు కె.బ్రహ్మాజీరావుకు సంతాపం తెలిపారు. బ్రహ్మాజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వైద్యానికి ఊపిరి

- పటిష్టంగా 'వైఎస్సార్ ఆరోగ్యశ్రీ' అమలు
- జిల్లాలోని 11 నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో సేవలు
- నాలుగున్నరేళ్లలో పేదలకు రూ.721.94 కోట్ల విలువైన చికిత్సలు



ఆరోగ్యశ్రీలో కార్పొరేట్ వైద్య సేవలు పొందుతున్న రోగులు

రాయవరం: కులం చూడం.. మతం చూడం.. ప్రాంతం చూడం.. వర్గం చూడం.. అందరికీ ఆరోగ్యమే మా అభిమతం. ఈ మాటలను అక్షరాలా సీఎం జగనన్న ప్రభుత్వం నిజం చేస్తోంది.. దేశ చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో పేదల ఆరోగ్యానికి భరోసానిచ్చింది.. ప్రజలందరికీ అత్యుత్తమ వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చింది.. నిరుపేదలు సైతం ధైర్యంగా కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందాలనే మహోన్నత ఆశయంతో దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి సారథ్యంలో 'ఆరోగ్యశ్రీ' పథకం పురుడు పోసుకుంది. తదనంతర కాలంలో టీడీపీ పాలకుల నిర్లక్ష్యంతో ఈ పథకం పడకేసింది. సకాలంలో బిల్లులు చెల్లించక పోవడంతో పేదలకు మెరుగైన వైద్యం దూరమైంది. ఈ క్రమంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తండ్రికి తగ్గ తనయుడిలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకానికి పునరుజ్జీవం పోశారు. జిల్లాలో ఏటా లక్షల మందికి ఆరోగ్య భరోసా కల్పిస్తున్నారు. సకాలంలో నిధులు విడుదల చేస్తూ పథకానికి జలసత్వాలు నింపుతున్నారు.

పకడ్బందీగా అమలు


వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని అధికారులు పకడ్బందీగా అమలు చేస్తున్నారు. జిల్లాలో అమలాపురం, రామచంద్రపురంలో ఏరియా ఆస్పత్రులు, టి.కొత్తపల్లి, ముమ్మిడివరం, అల్లవరం, రాజోలు, కొత్తపేట, ఆలమూరు, మండపేటలో సీహెచ్‌సీలు ఉండగా, ముమ్మిడివరం, అమలాపురం, మండపేట, రామచంద్రపురంలో రెండేసి చొప్పున మొత్తం అర్బన్ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో 49 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా, ప్రైవేట్ ఆస్పత్రులు 174 ఉంటాయి. ప్రభుత్వ పరిధిలోని ప్రధాన ఆసుపత్రులతో పాటు జిల్లాలో 11 నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులోకి తెచ్చారు. అలాగే ఉమ్మడి జిల్లాలో మొత్తం 228 మంది ఆరోగ్యమిత్రలు విధులు నిర్వర్తిస్తున్నారు. అలాగే 17 మంది టీమ్ లీడర్లు, ప్రతి జిల్లాకో ఒక కోఆర్డినేటర్ నిత్యం పర్యవేక్షిస్తున్నారు. కోనసీమ జిల్లా వ్యాప్తంగా దాదాపు 16 లక్షల మంది ఆరోగ్యశ్రీ కార్డుదారులున్నారు.

3,257 రోగాలకు వైద్యం

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత పటిష్టం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించి ఈ సేవలను విస్తృతం చేశారు. మొత్తం 3,257 వ్యాధులను పథకం పరిధిలో చేర్చి పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నారు. అలాగే శస్త్ర చికిత్సలు చేయించుకున్న అనంతరం రోగులను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకునేందుకు వైఎస్సార్ ఆసరా పథకాన్ని అమలు చేస్తున్నారు. శస్త్రచికిత్స చేయించుకున్న అనంతరం వారు కోలుకునే వరకూ రోజుకు రూ.225 వంతున ప్రభుత్వం వారి ఖాతాల్లో జమ చేస్తోంది. వైఎస్సార్ ఆసరా పథకంలో 1,519 వ్యాధులను చేర్చారు. ఆరోగ్యశ్రీకి సంబంధించిన బిల్లులు కేవలం 30 రోజుల్లోనే ప్రభుత్వం మంజూరు చేస్తోంది. దీంతో ఆసుపత్రుల నిర్వాహకులు సైతం పేదలకు ఖరీదైన చికిత్స అందించేందుకు ముందుకు వస్తున్నారు.

జిల్లాలో పరిస్థితి ఇదీ

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద సేవలందిస్తున్న ఆస్పత్రులకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తూ పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తుంది. ఇందుకోసం జిల్లాలో నాలుగున్నరేళ్లుగా రూ.721.94 కోట్లు ఖర్చు చేసింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 2020–21, 2021–22లో 2,06,221 మంది వైద్య సేవలకు రూ. 512.88 కోట్లు చెల్లించారు. అలాగే వైఎస్సార్ ఆసరా పథకం కింద 88,615 మందికి శస్త్రచికిత్సలు చేసి, వారి ఖాతాల్లో రూ.55.96 కోట్లు జమ చేశారు. జిల్లాల పునర్విభజన తర్వాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 2022–23 నుంచి ఈ ఏడాది అక్టోబర్ వరకూ 50,035 మందికి వైద్య సేవలు అందించారు. వైద్యానికి రూ.136.32 కోట్ల చెల్లింపులు చేశారు. అలాగే వైఎస్సార్ ఆసరా పథకం కింద 27,433 మందికి రూ.16.78 కోట్లు శస్త్రచికిత్సలు చేయించుకున్న రోగుల ఖాతాల్లో జమ చేశారు.



పైసా కూడా చెల్లించకుండా..



వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రభుత్వం ఉచితంగా వైద్య సేవలందిస్తోంది. పేదలకు మెరుగైన చికిత్స అందుబాటులోకి తీసుకు రావడమే లక్ష్యంగా పనిచేస్తోంది. ఆరోగ్యశ్రీ కింద వైద్యం పొందిన వారు ఎక్కడా పైసా కూడా కట్టక్కర్లేదు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవు. ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ కౌంటర్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. నిరంతర పర్యవేక్షణ చేస్తున్నాం.

– డాక్టర్ తాళ్లూరి ఆండ్రూ అల్బర్ట్ లూయిస్, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్

నాలుగున్నరేళ్లలో ఆరోగ్యశ్రీ పథకం కింద పొందిన సేవలిలా..

సంవత్సరం	ఆరోగ్యశ్రీ కేసులు	సొమ్ము రూ. కోట్లలో..	ఆసరా కేసులు	సొమ్ము రూ. కోట్లలో..
2020-21	93,224	210.92	32,303	20.33
2021-22	1,12,997	301.96	56,312	35.63
2022-23	34,312	93.41	20,047	12.42
2023-24 (అక్టోబర్)	15,723	42.91	7,386	4.36

ఎన్ఎంఎంఎస్ నమూనా పరీక్ష

జిల్లాలో 1,500 మంది హాజరు



కొత్తపాలెంలో నమూనా పరీక్ష పత్రాలను ఆవిష్కరిస్తున్న హెచ్ఎం శర్మ

కొత్తపేట: జిల్లాలో నేషనల్ మీన్స్ అండ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) నమూనా పరీక్షను ఆదివారం నిర్వహించారు. ఈ పరీక్షకు మొత్తం 1,500 మంది విద్యార్థులు హాజరైనట్లు జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం తెలిపారు. పేద కుటుంబాల్లోని ప్రతిభ చాటే విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ఎన్ఎంఎంఎస్ పథకం ద్వారా ఆర్థిక ప్రోత్సాహం అందిస్తుంది. ఇందులో భాగంగా ఉత్తమ విద్యార్థులను గుర్తించేందుకు వచ్చే నెల 3న ఎన్ఎంఎంఎస్ పరీక్ష జరగనుంది. కాగా ఏపీ స్కూల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ ద్వారా ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ఎంఎంఎస్ నమూనా పరీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో సుమారు 20 వేల మంది విద్యార్థులు ఈ పరీక్ష రాసినట్టు సుబ్రహ్మణ్యం తెలిపారు. కొత్తపేట మండలంలోని 10 ఉన్నత పాఠశాలల్లో 200 మంది, రావులపాలెం మండలంలో 200 మంది పరీక్షకు హాజరైనట్లు మండల పరీక్ష నిర్వాహకులు ఆదివారపుపేట వెంకటేశ్వరరావు, ఆదివారపుపేట వెంకటేశ్వరరావు, బండారు శేషు, నంబు సూరిబాబు, బండారు వెంకటేశ్వరరావు తెలిపారు. ముందుగా కొత్తపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో నమూనా ప్రశ్నపత్రాలను హెచ్ఎం ఏఎస్ఎస్ఎన్ఎస్ఆర్ఎల్ శర్మ, స్టాఫ్ సెక్రటరీ బి.పార్వతీశంకరరావు తదితరులు ఆవిష్కరించారు.

శుభకరా.. విఘ్నేశ్వరా



అయినవిల్లి విఘ్నేశ్వరుని సన్నిధిలో కొబ్బరికాయలు కొడుతున్న భక్తులు

అయినవిల్లి: విఘ్న నాయకుడిని భక్తులు కొలిచి తన్మయత్వం చెందారు. కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయం భక్తులతో కిక్కిరిసింది. ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో స్వామివారికి మేలుకొలుపు సేవ చేశారు. అనంతరం విశేష పూజలు నిర్వహించారు. స్వామివారి లఘున్యాస అభిషేకాలు, లక్ష్మీగణపతి హోమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పంచామృత, ప్రత్యేక అభిషేకాల్లో 156 మంది భక్త దంపతులు, స్వామివారి ప్రత్యేక దర్శనంలో 1,020 మంది, శ్రీలక్ష్మీ గణపతి హోమంలో 35 మంది, నూతన వాహన పూజలను 29 మంది చేయించుకున్నారు. 21 మంది చిన్నారులకు నామకరణలు, అక్షరాభ్యాసాలు, తులాభారం వంటి జరిగాయి. స్వామివారికి వివిధ సేవల ద్వారా రూ.3,08,450 ఆదాయం లభించిందని ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు, చైర్మన్ గుత్తుల నాగబాబు వివరించారు.

విరబూసిన ప్రతిభాసుమాలు

- రెండో రోజూ చిన్నారుల సందడి
- ముగిసిన క్రియ పిల్లల పండగ



విచిత్ర వేషధారణ పోటీకి వస్తున్న చిన్నారి



జానపద కళాకారులుగా చిన్నారుల సందడి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): క్రియ స్వచ్ఛంద సంస్థ జేఎన్‌టీయూకే ఆవరణలో రెండు రోజుల పాటు నిర్వహించిన 'క్రియ పిల్లల పండగ' ఆదివారంతో ముగిసింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లోని 350 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి వచ్చిన చిన్నారులు వర్సిటీ ఆవరణలో సందడి చేశారు. తమ కళ, ప్రతిభా నైపుణ్య ప్రదర్శనలతో ప్రేక్షకులను కట్టిపడేశారు. ఆదివారం సెలవు కావడంతో ఈ ప్రదర్శనను తిలకించడానికి విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులతో పెద్ద సంఖ్యలో తరలి రావడంతో ఆ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. విద్యార్థులకు జూనియర్, సబ్ జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ముఖ్యంగా జానపద నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. 'ఘల్లుఘల్లు జోడెడ్లబండి, వెంకీ మామ, కొండకోనల నడుమ, సంక్రాంతి వచ్చింది తుమ్మెద' వంటి హుషారెత్తించే జానపద గీతాలకు చిన్నారులు చేసిన నృత్యాలు అందరినీ అలరించాయి. పల్లె వాతావరణం కళ్లకు కట్టినట్టు అనిపించింది. కల్తీ పురుగు మందుల వాడకంతో రైతు నష్టపోయి ఆత్మహత్యకు పాల్పడటం, కరోనా భూతం, ప్లాస్టిక్ వాడకంతో అనర్థాల వంటి సందేశాలతో ప్రదర్శించిన విచిత్ర వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిత్రలేఖన పోటీలతో పాటు మట్టితో వివిధ ఆకృతులు, జంతువుల బొమ్మలు తయారు చేశారు. పోస్టర్ ప్రజెంటేషన్, కోలాటం, లఘు నాటికలు, దేవతామూర్తుల ప్రదర్శన, పాటలు, వీణా వాయిద్యం, కీబోర్డు, డ్రమ్స్ ఇలా 29 అంశాల్లో చిన్నారులకు ప్రదర్శన, పోటీలు నిర్వహించారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు దాదాపు 7 వేల మందికి పైగా హాజరు కావడంతో వలంటీర్లను ద్వారా ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, వసతి సదుపాయం కల్పించారు.



సంక్రాంతి సంప్రదాయ వేషధారణలో చిన్నారులు

క్రియ సేవలు ఆదర్శనీయం

ముగింపు కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ, సమాజానికి ఏదో ఒకటి చేయాలనే ఉద్దేశంతో కొంతమంది సేవకులు కలిసి ఏర్పాటు చేసిన క్రియ స్వచ్ఛంద సంస్థ.. నేడు పది వసంతాలు పూర్తి చేసుకుని ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పేరు సాధించడం అభినందనీయమని అన్నారు. బహుమతులు ప్రధానం కాదని, గెలుపు ఓటములతో సంబంధం లేకుండా ఆసక్తి ఉన్న పోటీల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమ నిర్వహణకు కృషి చేస్తున్న క్రియ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఎస్ఎస్ఆర్ జగన్నాథరావును ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల విద్యా శాఖ ఆర్‌జేడీ నాగమణి పాల్గొన్నారు.

సమసమాజ నిర్మాణానికి కృషి



కలెక్టరేట్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జేసీ నుపూర్ అజయ్

అమలాపురం రూరల్: సమసమాజ నిర్మాణానికి పౌరులంతా తమ వంతు కృషి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్ పిలుపునిచ్చారు. ఆదివారం అమలాపురంలోని జిల్లా కలెక్టరేట్‌లో రాజ్యాంగ దినోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. తొలుత భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. హాజరైన అధికారులు, విద్యార్థులు, కలెక్టరేట్ సిబ్బందితో న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం సౌభ్రాతృత్వం యొక్క విలువలను నిలబెట్టేందుకు విధేయతతో కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ 1949 నవంబర్ 26న భారత రాజ్యాంగానికి ఆమోదం తెలిపారన్నారు. 2015లో భారత ప్రభుత్వం నవంబర్ 26వ తేదీని రాజ్యాంగ దినోత్సవంగా పాటించాలని ఆదేశించిందన్నారు. అప్పటి నుంచి దేశమంతా ప్రతి ఏటా రాజ్యాంగ దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ప్రభుత్వ సేవకులుగా రాజ్యాంగ నిబంధనలను సమర్థవంతంగా అమలు చేయడం అందరి కర్తవ్యంగా భావించాలని సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, ఆర్డీఓ జి.కేశవవర్ధన్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకర్ ప్రసాద్, సోషల్ వెల్ఫేర్ జేడీ జ్యోతిలక్ష్మీదేవి, డీఈఓ కమలకుమారి, కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి కె.విశ్వేశ్వరరావు, కలెక్టరేట్ ఉద్యోగులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరిపై భక్తజన వాహిని

- సత్యదేవుని దర్శించిన 60 వేల మంది భక్తులు
- 6,500 వ్రతాలు.. రూ.60 లక్షల ఆదాయం



పౌర్ణమితో కూడిన సోమవారం కావడంతో ఆదివారం రాత్రికే పెద్ద సంఖ్యలో అన్నవరం చేరుకున్న భక్తులు

అన్నవరం: పవిత్ర కార్తిక మాసం.. అందునా ఉదయం శుద్ధ చతుర్దశి, మధ్యాహ్నం పౌర్ణమి తిథులు ఒకే రోజు కలసి రావడం.. ఆపై సెలవు రోజు కావడంతో రత్నగిరిపై ఆదివారం భక్తజనవాహిని పరవళ్లు తొక్కింది. భక్తవరదుడైన సత్యదేవుడిని దర్శించేందుకు వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఆలయాన్ని శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత ఒంటి గంటకు తెరచి స్వామివారికి పూజలు చేశారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. సత్యనారాయణస్వామి వ్రతాలను కూడా తెల్లవారుజామున రెండు గంటలకే ప్రారంభించారు. అప్పటి నుంచి ఆదివారం సాయంత్రం వరకూ దేవస్థానంలో భక్తులు ప్రవాహంలా వస్తూనే ఉన్నారు. రద్దీ కారణంగా ఉదయం నుంచి అంతరాలయ దర్శనం నిలిపివేశారు. వ్రత మండపాలతో పాటు నిత్య కల్యాణ మండపంలో కూడా వ్రతాలు నిర్వహించారు. 60 వేల మంది స్వామివారిని దర్శించి పూజలు చేశారని అధికారులు తెలిపారు. ఆరు వేల వ్రతాలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.60 లక్షల ఆదాయం సమకూరింది. ఆలయంలో ఏర్పాట్లను దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్ర మోహన్ పర్యవేక్షించారు.

ఇప్పటి వరకూ 45,500 వ్రతాలు

కార్తిక మాసం ప్రారంభమైనప్పటి నుంచి ఆదివారం వరకూ 14 రోజుల్లో 45,500 వ్రతాలు జరిగాయని అధికారులు తెలిపారు. గత ఏడాది కార్తికంలో 1,42,373 వ్రతాలు జరిగాయి. ఆ రికార్డును అధిగమించాలంటే మిగిలిన 16 రోజుల్లో లక్ష వ్రతాలు జరగాలి. కార్తిక పౌర్ణమి, సోమవారం పర్వదినం కలసి రావడంతో నేడు కూడా సత్యదేవుని సన్నిధికి భారీగా భక్తులు తరలి రానున్నారు. వ్రతాలు తెల్లవారుజామున ఒంటిగంటకే ప్రారంభించనున్నారు. ఆదివారం రాత్రికే భక్తులు ఆలయానికి చేరుకున్నారు

క్లుప్తంగా

అంతర్ జిల్లాల క్రీడా పోటీల్లో ప్రతిభ



వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో విజేతగా నిలిచిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పాఠశాల క్రీడా సమాఖ్య అండర్–14, 17 అంతర్ జిల్లాల పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించారు. ఈ నెల 24 నుంచి 26 వరకూ శ్రీకాకుళం జిల్లాలో జరిగిన అండర్–17 బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ద్వితీయస్థానం, అండర్–14 విభాగంలో తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. ఈ నెల 23 నుంచి 25 వరకూ కర్నూలు జిల్లాలో జరిగిన అంతర్ జిల్లాల అండర్–17 వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలికలు ప్రథమ స్థానం, బాలురు ద్వితీయ స్థానంలో నిలిచాయని ఎస్జీఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ ఆదివారం తెలిపారు. విజేతలను జిల్లా విద్యాశాఖ సంయుక్త సంచాలకులు, ఇన్‌చార్జి డీఈఓ నాగమణి, డీఎస్ఏ సీఈఓ శ్రీనివాస్ కుమార్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు జార్జి, జిల్లా అధ్యక్షుడు రవిరాజు అభినందించారు. జట్టుకు కోచ్‌గా డీఎస్ఏ వెయిట్ లిఫ్టింగ్ కోచ్ సతీష్‌కుమార్ వ్యవహరించారు.

కొంతమూరులో చోరీ

రాజానగరం: రాజమహేంద్రవరం రూరల్ మండలం కొంతమూరులో చోరీ జరిగింది. సుమారు రూ.లక్ష విలువైన ఒకటిన్నర కిలోల వెండి ఆభరణాలను దుండగులు అపహరించుకుపోయారు. దీనికి సంబంధించి రాజానగరం పోలీసుల కథనం ప్రకారం.. ధవళేశ్వరంలోని నీటిపారుదల శాఖలో ఉద్యోగం చేసి, రిటైర్ట్ అయిన ఎం.పి.ప్రకాష్ కొంతమూరులో నివాసం ఉంటున్నారు. శుక్రవారం ఉదయం ఇంటికి తాళం వేసి, కుటుంబ సభ్యులంతా కలిసి బయటకు వెళ్లారు. తిరిగి శనివారం ఉదయం వచ్చేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. దీంతో ఇంట్లో చోరీ జరిగిందనే విషయాన్ని గ్రహించి, లోనికి వెళ్లి చూస్తే బీరువాలోని ఒకటిన్నర కిలోల వెండి ఆభరణాలు కనిపించలేదు. దీనిపై బాధితుడు ప్రసాద్ ఆదివారం రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సుధాకర్ తెలిపారు.

రక్తమోడిన రహదారి

- రోడ్డు ప్రమాదంలో తల్లీ కొడుకుల మృతి
- ఆగి ఉన్న ట్రాక్టర్, బైక్‌లను ఢీకొన్న లారీ
- చేపూరు జంక్షన్ వద్ద ఘటన

తుని రూరల్: మరో రెండు కిలోమీటర్లు వెళ్తే ఇంటికి చేరుకుంటారు.. ఇంతలో లారీ రూపంలో వచ్చిన మృత్యువు తల్లీ కొడుకుల ప్రాణాలను మింగేసింది. కాకినాడ జిల్లా తుని మండలం చేపూరు వద్ద జాతీయ రహదారిపై ఈ ఘటన జరిగింది. తుని రూరల్ ఎస్సై విజయబాబు కథనం ప్రకారం.. లోవ కొత్తూరు గ్రామానికి చెందిన వైరాల లోవరాజు తన భార్య బేబీ (30), కుమారుడు నవదీప్ అనే పండు (11)తో కలసి పిఠాపురంలో బంధువుల ఇంటికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో మోటార్ సైకిల్‌పై స్వగ్రామానికి బయలు దేరారు. జాతీయ రహదారిపై చేపూరు జంక్షన్‌కు వచ్చాయి. అక్కడ ఓ లారీ యూటర్న్ తిరుగుతుండటంతో వారి బైక్, గడ్డి ట్రాక్టర్ ఆగాయి. అదే సమయంలో రాజమహేంద్రవరం వైపు నుంచి విశాఖపట్నం వైపు వెళ్లే మరో లారీ గడ్డి ట్రాక్టర్‌ను, లోవరాజు, బేబి, నవదీప్ ప్రయాణిస్తున్న బైక్‌ను బలంగా ఢీకొంది. దీంతో గడ్డి ట్రాక్టర్ ఇంజిన్ నుజ్జునుజ్జు అయ్యింది. బైక్‌పై ఉన్న నవదీప్, బేబీ, లోవరాజు రోడ్డుపై పడిపోయారు. బలమైన గాయాలు కావడంతో బాలుడు నవదీప్ సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఈ విషయం తెలియడంతో సంఘటనా స్థలానికి రూరల్ సీఐ ఎ.సన్యాసిరావు, ఎస్సై విజయబాబు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. తీవ్రంగా గాయపడిన బేబీ, స్వల్ప గాయాలైన లోవరాజును తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన నిమిత్తం బేబీని కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేశారు. పరిస్థితి విషమించడంతో మార్గమధ్యం పిఠాపురం సమీపంలో బేబీ మృతి చెందింది. తల్లీ కుమారుల మృతదేహాలను



ప్రమాద స్థలంలో బైక్, గడ్డి ట్రాక్టర్, లారీ



బాలుడు నవదీప్ మృతదేహం

పోస్ట్‌మార్టం నిమిత్తం తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై విజయబాబు తెలిపారు.

మరో పది నిమిషాల్లో ఇంటికి..

పిఠాపురం నుంచి తుని మండలం లోవకొత్తూరుకు 65 కిలోమీటర్లు. పిఠాపురంలో బయలు దేరిన లోవరాజు, బేబీ, నవదీప్‌లు 60 కిలోమీటర్లు ప్రయాణించి చేపూరు చేరుకున్నారు. మరో పది నిమిషాల్లో ఇంటికి సురక్షితంగా చేరుకుంటారు. ఈ సమయంలో మృత్యువు లారీ రూపంలో వచ్చి నవదీప్, బేబీలను కబళించిందని బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. ఒక్కడే సంతానం కావడంతో నవదీప్‌ను ఆ దంపతులు అల్లారుముద్దుగా చూసుకునేవారు. తన కళ్లెదుటే కుమారుడు నవదీప్, భార్య బేబీ చనిపోవడంతో లోవరాజు దుఃఖానికి



కుమారుడు నవదీప్, భార్య బేబీతో క్షతగాత్రుడు లోవరాజు (ఫైల్)

అవధులు లేకుండా పోయాయి. గ్రామానికి చెందిన ఇద్దరి మృతితో లోవకొత్తూరులో విషాదఛాయలు అలముకున్నాయి.

స్తంభించిన ట్రాఫిక్

చేపూరు జంక్షన్‌లో ప్రమాదం జరగడంతో హైవేపై ట్రాఫిక్ స్తంభించింది. రూరల్ సీఐ ఆధ్వర్యంలో మృతదేహాన్ని, క్షతగాత్రులను తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో వందలాది వాహనాలు హైవేపై నిలిచిపోయాయి. స్తంభించిన ట్రాఫిక్‌ను దారి మళ్లించి కొంతమేరకు క్రమబద్ధీకరించారు. ప్రొక్లెయిన్ సహాయంతో లారీలో చిక్కుకున్న మోటార్ సైకిల్‌ను, గడ్డి ట్రాక్టర్ ఇంజిన్‌ను విడదీశారు. ఆ తర్వాత లారీ, ట్రాక్టర్, బైక్‌లను ఘటనా స్థలం నుంచి తొలగించారు. అనంతరం పూర్తి స్థాయిలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ఇక్కడే అనేక ప్రమాదాలు

జాతీయ రహదారిపై చేపూరు జంక్షన్‌లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా హైవే అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు అంటున్నారు. 2002లో నాలుగు లైన్లుగా అభివృద్ధి చేసిన ఈ రహదారికి చేపూరు జంక్షన్‌లో ప్రమాదాల నివారణకు అండర్ పాస్ నిర్మించి, అప్రోచ్ రోడ్లు వేయాల్సి ఉంది. ఇది జరగక ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. నెలలో నాలుగైదు ప్రమాదాలు జరగడం ఇద్దరు, ముగ్గురు ప్రాణాలు కోల్పోవడం, పలువురు క్షతగాత్రులు అవుతుండడం పరిపాటిగా మారింది. ఇప్పటికైనా జాతీయ రహదారి నిర్వహణ అధికారులు పట్టించుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

చదువుతో పాటు క్రీడలు అవసరం



సాఫ్ట్‌బాల్ టెన్నిస్‌లో కాకినాడ జిల్లా బాలుర జట్టుకు కప్ అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే శేషారెడ్డి

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): విద్యార్థినీ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమని మాజీ ఎమ్మెల్యే, ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి అన్నారు. ఆదివారం కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో సాఫ్ట్‌బాల్ టెన్నిస్ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న అంతర్ జిల్లా సబ్ జూనియర్స్ సాఫ్ట్‌బాల్ టెన్నిస్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ ముగింపు సభకు మాజీ ఎమ్మెల్యే శేషారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. సాఫ్ట్‌బాల్ టెన్నిస్ క్రీడాభివృద్ధికి కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తానన్నారు. విజేతలను అభినందించారు. డీఎస్ఏ సీఈఓ, చీఫ్ కోచ్ శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ ఆటల్లో గెలుపు ఓటములు సహజమని, క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం విజేతలకు ముఖ్య అతిథి శేషారెడ్డి బహుమతులు అందజేశారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో బాలుర విభాగంలో గుంటూరు, కాకినాడ, ఎన్టీఆర్ జిల్లాలు మొదటి మూడు స్థానాలు పొందాయి. బాలికల విభాగంలో కృష్ణా, గుంటూరు, కాకినాడ జిల్లాలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్నాయి. కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్ టెన్నిస్ సంఘ అధ్యక్షుడు సాయిబాబా, వీవీ సత్యనారాయణరెడ్డి, నీలిమ, మాజీ కార్పొరేటర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

కొత్త పంథాలో సైబర్ నేరాలు

- కలెక్టర్ మాధవీలత పేరుతో మెసేజ్
- రెండో పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): సైబర్ నేరాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి.. నేరగాళ్లు సామాన్యులనే కాదు అధికారులనూ మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. రాజమహేంద్రవరంలో జరిగిన ఘటనే అందుకు నిదర్శనం. ఆ వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం రాజమహేంద్రవరం అర్బన్ తహసీల్దార్ సుస్వాగతంకు జిల్లా కలెక్టర్ మాధవీలత అధికారిక ఫోన్ నంబర్ ద్వారా ఓ మెసేజ్ వచ్చింది. తన సమీప బంధువుకు ప్రమాదం జరిగిందని, రూ.50 వేలు ఫోన్‌పే చేసి సదరు స్క్రీన్ షాట్ పంపాలని ఆమె కోరినట్లు ఆ సందేశ సారాంశం. దీంతో తహసీల్దార్‌కు అనుమానం వచ్చి వాకబు చెయ్యగా ఇది హ్యాకర్స్ పనిగా గుర్తించారు. వెంటనే ఆయన రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ నంబరు ద్వారా వాట్సాప్ కాల్స్, సందేశాలు వచ్చాయని తహసీల్దార్ వి.సుస్వాగతం ఫిర్యాదులో పేర్కొన్నారు. కలెక్టర్లు, అధికారులు, బంధువుల ఫొటోలతో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఇలా మోసం చేసేందుకు వాట్సాప్‌లో మెసేజ్‌లు, కాల్స్ చేస్తున్నట్లు ఆయన వివరించారు.

అప్రమత్తంగా ఉండండి



కలెక్టర్ మాధవీలత

రోజుకో కొత్త పంథాలో సైబర్ నేరగాళ్లు మోసాలు చేస్తున్నారని, దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తూర్పుగోదావరి జిల్లా మేజిస్ట్రేట్, కలెక్టర్ మాధవీలత ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే సందేశాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. సైబర్ నేరగాళ్ల నుంచి ఎటువంటి సందేశాలు వచ్చినా వెంటనే పోలీసులకు, సైబర్ క్రైమ్ బ్రాంచ్ అధికారులకు సమాచారం ఇవ్వాలని మాధవీలత విజ్ఞప్తి చేశారు. ఇటువంటి వారి ఉచ్చులో పడి మోసపోవద్దన్నారు. బాధ్యత కలిగిన పౌరులుగా ఇటువంటి మోసాలకు అడ్డుకట్ట వేద్దామన్నారు.

ఎస్‌జీఎఫ్ బాలురు, బాలికల జట్ల ఎంపిక



అండర్–17 బాస్కెట్‌బాల్ బాలుర రాష్ట్ర జట్టు



బాలికల బాస్కెట్‌బాల్ రాష్ట్ర జట్టు

రాయవరం: జాతీయ స్థాయి 67వ ఎస్‌జీఎఫ్ బాస్కెట్ బాల్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టును ఆదివారం రాయవరంలో ప్రకటించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు పి.త్రినాథవర్మ (కాకినాడ జిల్లా)లతో కూడిన కమిటీ 12 మంది క్రీడాకారులను ఎంపిక చేయగా, వ్యాయామ ఉపాధ్యాయురాలు జి.శ్రీదేవి (తూర్పుగోదావరి జిల్లా), ఎస్.లక్ష్మి (కృష్ణా), ఎన్.ముస్తాహీర్ (కర్నూలు) బృందంతో కూడిన కమిటీ ఆధ్వర్యంలో బాలికల రాష్ట్ర బాస్కెట్‌బాల్ జట్టును ఎంపిక చేశారు. 13 జిల్లాల నుంచి 312 మంది క్రీడాకారులు హాజరు కాగా, 41 మంది కోచ్ మేనేజర్లు, 26 మంది అఫీషియల్ అధికారులు, మరో 25 మంది ఆర్గనైజింగ్ అధికారులుగా వ్యవహరించారు. మొత్తం 46 లీగ్, క్వార్టర్, సెమీ, ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించారు.

ఎంపికైన క్రీడాకారులు వీరే..

అంతర్ జిల్లా పోటీల్లో మెరుగైన ఆటతీరు కనబర్చిన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. అండర్–17 బాలికల విభాగంలో బి.ప్రభుదీపిక (కృష్ణా), కె.నందిని, ఎస్‌కే దిలాఫోర్జ్ (గుంటూరు), ఎన్.మానస (తూర్పుగోదావరి), ఎ.రిత్విక, జి.పూజిత (పశ్చిమగోదావరి), బి.ప్రణవి (కృష్ణా), ఎం.హాసినిచౌదరి (చిత్తూరు), జి.పరిమళ (అనంతపురం), మేథాపండా (విశాఖపట్నం), ఎ.శ్రీజ (గుంటూరు), ఎస్‌కే మల్మునా (నెల్లూరు) ఎంపికయ్యారు.

- అండర్–17 బాలుర జాతీయ జట్టుకు వి.రాహుల్, బి.బాలాజీ (కృష్ణా), ఎస్.థిలార్స్, వి.తేజస్వరూప్ (పశ్చిమగోదావరి), కె.హరీష్ (గుంటూరు), ఏఈ తేజ (పశ్చిమగోదావరి), ఎ.జగన్ (తూర్పుగోదావరి), సీకే హిమచరణ్ (చిత్తూరు), ఎస్ఎండీఎస్ షాకిబ్ (కర్నూలు), సీహెచ్ మదన్ (నెల్లూరు), ఎ.అమల్‌రెడ్డి (కృష్ణా), డి.కృష్ణారెడ్డి (తూర్పుగోదావరి)లు ఎంపికయ్యారు.
- స్టాండ్‌బై ప్లేయర్లుగా బాలికల జట్టు నుంచి సీహెచ్‌బీ శ్రీలక్ష్మి (తూర్పుగోదావరి), బి.స్నేహలత (కృష్ణా), డి.సాయిభవాని (పశ్చిమగోదావరి), పి.మయూరి (కర్నూలు), జి.కిరణ్మయి (అనంతపురం)లు, బాలుర జట్టు నుంచి కె.యశ్వంత్‌రెడ్డి (కడప), ఎన్.సుందర్ (పశ్చిమగోదావరి), ఆర్.గరివ్వన్ (తూర్పుగోదావరి), ఎండీ అమీర్‌అలీ (గుంటూరు), బి.సంజయ్ శ్రీనివాస్ (కృష్ణా)లు ఎంపికయ్యారు.

అసభ్య ప్రవర్తనపై ఫిర్యాదు

రౌతులపూడి: విద్యార్థినులపై ఓ ప్రధానోపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ విషయం ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం ఎస్.అగ్రహారం బీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా వంతు భీమరాజు పనిచేస్తున్నారు. ఆ పాఠశాలలో చదువుతున్న బాలికలపై హెచ్ఎం అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని తల్లిదండ్రులు ఆరోపిస్తూ, ఆయన ప్రవర్తనపై పూర్తి విచారణ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై ఎంఈఓ–2 గాడి కొండబాబును 'సాక్షి' వివరణ కోరగా దీనిపై తమకు ఇప్పటికే ఫిర్యాదు అందిందన్నారు. ఈ ఘటనపై చిన్నారులు, తల్లిదండ్రుల నుంచి వివరాలు సేకరించామన్నారు. ప్రధానోపాధ్యాయుడి నుంచి కూడా వివరాలు తీసుకుని ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని వివరించారు.

మహిళపై హత్యాయత్నం

కాకినాడ క్రైం: కాకినాడలో ఓ మందుల దుకాణంలో పనిచేస్తున్న యువకుడు ఓ మహిళపై హత్యాయత్నానికి ఒడిగట్టాడు. క్రైం పోలీసుల కథనం మేరకు.. కాకినాడ గాంధీనగర్‌లోని యూనియన్ బ్యాంకు ఏటీఎం ఎదురుగా ఉన్న ఓ జనరిక్ మందుల దుకాణంలో పొన్నాడ వెంకటేష్ పనిచేస్తున్నాడు. అదే దుకాణానికి ఒంటిమామిడి జంక్షన్ వద్ద ఓ ఇంట్లో నివసిస్తున్న 66 ఏళ్ల చెలంచెర్ల సత్యవతి మందులు కొనేందుకు వెళ్లేది. 20 రోజుల కిందట వెంకటేష్ వద్ద ఓ షాంపు కొనుగోలు చేసింది. అది వాడిన తర్వాత జుట్టు ఎక్కువగా రాలిపోతోందంటూ వెంకటేష్‌తో ఘర్షణ పడింది. ఇదే రీతిలో సత్యవతి పలుమార్లు వెంకటేష్‌ను తిట్టింది. దీంతో ఆ యువకుడు ఆదివారం ఆమె భర్త ఇంటి నుంచి బయటకు వెళ్లిన సమయంలో ఇంట్లోకి ప్రవేశించి నన్నే తిడతావా అంటూ సత్యవతిపై దాడి చేశాడు. ఈ దాడిలో ఆమె మెడ, బుగ్గ, చేతిపై గాయాలయ్యాయి. వెంటనే వెంకటేష్ పరారయ్యాడు. రక్తపు గాయాలతో సత్యవతి ఇంటి నుంచి బయటకు రాగా ఆమె భర్త వెంకటరత్నం హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ట్రస్ట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఘటనపై కాకినాడ సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉంటే బంగారం కోసమే యువకుడు దాడి చేశాడని, తన భార్య మెడలో సుమారు 35 గ్రాముల బంగారు గొలుసు అవహరించాడని సత్యవతి భర్త వెంకటరత్నం ఆరోపించారు. దాడి అనంతరం యథావిధిగా దుకాణంలో కూర్చొని వ్యాపారం చేసుకుంటున్న వెంకటేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

విద్య... ఉద్యోగం

- ఇంటర్‌తో ఐటీ కొలువు
- హెచ్‌సీఎల్ టెక్–బీ, ఇంటర్ బోర్డు సంయుక్త ప్రణాళిక
- రిజిస్ట్రేషన్లకు తుది గడువు ఈ నెల 30



రాయవరం: ఐటీ కొలువు సాధించాలంటే ఇంటర్ తర్వాత ఇంజినీరింగ్ చదవాలి. ఇంజినీరింగ్‌లో కంప్యూటర్ సైన్స్ కోర్సు చదివిన విద్యార్థులు సాఫ్ట్‌వేర్ బాట పడుతున్నారు. అయితే కేవలం ఇంటర్ చదువుతోనే ఐటీ కొలువు పొందే అవకాశాన్ని హెచ్‌సీఎల్ టెక్ సాఫ్ట్‌వేర్ కంపెనీ కల్పిస్తోంది. ఇంటర్మీడియేట్ సెకండియర్ చదువుతున్న విద్యార్థులకు హెచ్‌సీఎల్ టెక్–బి సంస్థ బంపర్ ఆఫర్ ప్రకటించింది. ఇంటర్ విద్య అనంతరం నేరుగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసుకునే అవకాశాన్ని విద్యార్థులు అందిపుచ్చుకునేలా కార్యక్రమాన్ని రూపొందించింది. ఇంటర్మీడియేట్ బోర్డు, హెచ్‌సీఎల్ టెక్–బి సంస్థ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. ఇందులో ఎంపికైన విద్యార్థులు ఉద్యోగం చేసుకుంటూనే ఉన్నత చదువులను ప్రముఖ యూనివర్సిటీల్లో చదువుకునే చక్కటి అవకాశాన్ని కూడా కల్పించింది.

ప్రతి విద్యార్థి ప్రయోజకుడు కావాలనే..

ఇంటర్‌లో 75 శాతం మార్కులు సాధించే వారికి ఐటీ కొలువులు కల్పించే బాధ్యతను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకుంది. విద్యలో ప్రతిభ చూపే విద్యార్థులను ప్రభుత్వం ఇప్పటికే అన్నివిధాలా ప్రోత్సహిస్తోంది. విద్యార్థులకు చిన్న వయసులోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు కల్పించేలా ప్రభుత్వం సాఫ్ట్‌వేర్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుంటోంది. రాష్ట్రంలో చదువుతున్న ప్రతి విద్యార్థి ప్రయోజకుడిగా ఎదగాలన్నదే లక్ష్యంగా విద్యా సంస్కరణలు ఇప్పటికే అమలు చేస్తోంది. ఇందులో భాగంగానే హెచ్‌సీఎల్ టెక్–బి సంస్థ ద్వారా ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తోంది.

రెండు విభాగాల్లో..

విద్యార్థులకు రెండు విభాగాల్లో ఉద్యోగాలు కల్పిస్తారు. ఇంటర్‌లో మ్యాథ్స్‌తో కూడిన విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ రోల్స్ ఇవ్వబడతాయి. మ్యాథ్స్ లేని సీఈసీ, హెచ్ఈసీ, బైపీసీ, ఒకేషనల్ కోర్సులు చదివిన వారికి డిజిటల్ ప్రోసెస్ ఆపరేషన్స్ విభాగం (డీపీఓ)లో ఉద్యోగాలు ఇస్తారు. ఎంపీసీ, ఎంఈసీ చదివిన విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇస్తారు. దీనిలో ఎంపికైన వారికి ఉద్యోగం చేస్తూనే ఉన్నత విద్యను అభ్యసించేలా ప్రణాళిక రూపొందించారు. ఇందుకు సంబంధించి హెచ్‌సీఎల్ సంస్థ బిట్స్ పిలాని, శస్త్ర, అమిటీ (ఏఎంఐటీవై), ఐఐఎం నాగ్‌పూర్, కేఎల్ వర్సిటీ, ఐఐటీ గౌహతి, ఐఐఐటీ కొట్టాయంలతో ఒప్పందాలు చేసుకున్నారు. ఇందులో ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థుల ఫీజులో కొంత మొత్తాన్ని హెచ్‌సీఎల్ కంపెనీ చెల్లించనుంది.

ఎవరు అర్హులంటే..

ఇంటర్మీడియేట్‌లో 75 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన అన్ని గ్రూపుల విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించేలా హెచ్‌సీఎల్ టెక్–బి సంస్థ, ఇంటర్మీడియేట్ బోర్డు ఒప్పందం కుదుర్చుకున్నాయి. 2022, 2023లో ఉత్తీర్ణత సాధించిన వారు, 2024 విద్యా సంవత్సరంలో ఇంటర్ సెకండియర్ పరీక్షలు రాయనున్న వారు దీనికి అర్హులు. సంబంధిత విద్యార్థులు ఈ నెల 30వ తేదీలోగా రిజిస్ట్రేషన్లు చేసుకోవాలి. ఈ సంస్థలో ఎంపిక కావడానికి విద్యార్థులకు మూడు దశల్లో పరీక్షలు నిర్వహిస్తారు. తొలుత క్యాట్ పరీక్ష ఉంటుంది. అనంతరం ఇంగ్లిష్ నైపుణ్య పరీక్ష నిర్వహించి, చివరిగా ఎంపికైన వారికి ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. మూడు పరీక్షల్లో నెగ్గుకొచ్చిన విద్యార్థులకు ఏడాది పాటు శిక్షణనిస్తారు. శిక్షణ కాలంలో ఏడో నెల నుంచి నెలకు రూ.10 వేల వంతున స్టైఫండ్ అందజేస్తారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి వేతనంతో కూడిన ఉద్యోగం లభిస్తుంది.

ఆన్‌లైన్ పరీక్ష ఎప్పుడంటే..

వచ్చే నెల 11న ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు తూర్పుగోదావరి జిల్లా విద్యార్థులకు, వచ్చే నెల 12న కాకినాడ జిల్లా, 15న డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా విద్యార్థులకు ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహిస్తారు. ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఈ పరీక్ష రాయనున్నారు. ఆన్‌లైన్ కాట్ (కెరీర్ ఆప్టిట్యూడ్ టెస్ట్)కు రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు హాజరు కావాల్సి ఉంటుంది. హెచ్‌టీటీపీఎస్://బీఐటీ.ఎల్‌వై/టీఈసీహెచ్‌బీఈఈజీవోఏపీ లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. కళాశాలల ద్వారా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు మాత్రం పైన తెలిపిన తేదీల్లో పరీక్షలు నిర్వహిస్తారు. ఆన్‌లైన్ ద్వారా వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు కంపెనీ నుంచి ఫోన్ వచ్చిన తర్వాత తేదీని ప్రకటిస్తారు.

అవగాహన కల్పిస్తున్నాం..



ఇంటర్ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా కళాశాలల్లో అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటికే ఈ పరీక్షకు సంబంధించిన సమాచారాన్ని జిల్లాలో ఉన్న జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు అందించాం. అధిక సంఖ్యలో విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకునేలా ప్రిన్సిపాల్స్ చర్యలు చేపట్టాలి.

– ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి, డీవీఈవో, అమలాపురం

ప్రతి ఒక్కరూ అందిపుచ్చుకోవాలి



అర్హత ఉన్న ప్రతి ఒక్క విద్యార్థి చక్కటి అవకాశాన్ని అందిపుచ్చుకోవాలి. ఈ పరీక్షలో ప్రతిభ చూపిన వారికి విద్య, ఉపాధి ఒకేసారి లభిస్తుంది. అన్ని గ్రూపులకు సంబంధించిన విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా అవగాహన కల్పిస్తున్నాం.

– డి.సాయికిరణ్, హెచ్‌సీఎల్ టెక్ కంపెనీ ప్రతినిధి, విజయవాడ

గొప్ప అవకాశంగా భావిస్తున్నా..



నేను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెకండియర్ ఎంపీసీ చదువుతున్నాను. చదువుతో పాటు ఉద్యోగం కల్పించే విధంగా హెచ్‌సీఎల్ టెక్ సంస్థ నిర్వహిస్తున్న పరీక్షకు హాజరవుతున్నాను. దీనిని గొప్ప అవకాశంగా భావిస్తున్నాను. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటాను.

– బి.ప్రియాంక, ఇంటర్ సెకండియర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, రాజోలు